


*పాఠకుల అనుభవాల మాలిక*

## కోకా లక్ష్మణ్

సదరన్ కాలిఫోర్నియాలో ఒక ఆహ్లాదకరమైన సాయంకాలం..డిసెంబర్ 1994.. ఆర్టీజియా, లిటిల్ ఇండియాలో 'సాహిల్' బొటిక్ ని అక్క నడుపుతోంది. అమ్మ అక్కడ వుంటే, తనని చూడడానికని బొటిక్ కి వెళ్ళాను. హ ఠాత్తుగా ఒక చిరునవ్వుల చిన్నారి, ఓ అందమైన అమ్మాయి తలుపు తెరుచుకుని లోనికి వచ్చి మా అమ్మని చూడడానికి వచ్చానని చెప్పింది. తనని అమ్మ వద్దకి తీసుకెళ్ళేప్పుడే తన గురించి తెలుసుకున్నాను. మా అమ్మ కజిన్ కి తను మేనకోడలట, పేరు విద్య .. కొద్ది సమయంలోనే ఒకరి వివరాలు మరొకరం తెలుసుకున్నాం. తను అమ్మతో మాట్లాడి వెళ్ళిపోయింది.. ఎందుకో మొదటి చూపులోనే ఆకర్షించిన విద్య నా జీవిత భాగస్వామి ఔతుందని అప్పుడు ఊహించలేకపోయాను. అప్పటివరకూ నా మిత్రబృందమంతా గుజరాతీలు, పంజాబీలు అవడంతో, ఒక చక్కటి తెలుగు అమ్మాయిని కలుసుకోవడం చాలా ఆనందమనిపించింది. తన గురించి మరిన్ని వివరాలు తెలుసుకోవాలనీ, తనని మళ్ళీ కలుసుకోవాలనీ అనిపించింది. ఈ ఆలోచనలు నాలో ఇంకా ఆలోచనల రూపంలో ఉండగానే, కొన్ని రోజులకి తన వద్దనుంచీ ఫోన్ వచ్చింది. లాంగ్ బీచ్ లో తను రెసిడెన్సీ చేస్తున్న యు.సి.ఐ లో జరుగుతున్న క్రిస్మస్ పార్టీ కి రమ్మని విద్య ఆహ్వానించింది. వెళ్ళాను.. పార్టీలో విద్య, తన మిత్రులతో..చాలా సరదాగా గడిచింది. తొందరలోనే విద్య తో స్నేహం బలపడింది. తరచు కలుసుకుంటూండే వాళ్ళం.. తను రెసిడెన్సీ బిజీలో ఉంటే నేను ఓ వైపు ఉద్యోగం, మరోవైపు ఫేషన్ షోలు, అందాల పోటీలూ నిర్వహించడం, వాటిల్లో వ్యాఖ్యాతగా వ్యవహరించడంలో బిజీ గా వుండేవాడిని.. అప్పట్లో..అంటే 1994 లోనే నా ఆర్గనైజర్ లో దాదాపు 800 మంది ఫోన్ నంబర్లు ఉండేవి..నాకు ఫ్రెండ్స్ ఎక్కువ అని విద్య ఆట పట్టిస్తుండేది..( ఫ్రెండ్స్ సంఖ్యకంటే..అందులో ఆడవాళ్ళు ఎంతమందో అని విద్యకి అప్పటికే ఆతృతగా ఉండేదని నాకో చిన్న సందేహం..!!)



రోజులు గడుస్తున్నాయి..విద్యకీ నాకూ స్నేహమూ పెరుగుతోంది. 1997 తానా సభల్లో నేను యూత్ కమిటీ ఛైర్ పర్సన్ గా పనిచేశాను. విద్యకూడా నాతో కల్సి తానా యువత కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంది. ఈ సమయంలోనే మేమిద్దరం ఎక్కువ సేపు కలిసి గడపడానికి అవకాశం దొరికింది. తానా సమావేశాలు ముగిసే సరికి మా ఇద్దరి అంతరంగాల్లోనూ ఒకరంటే మరొకరికి 'ఇష్టం' అనే భావం ఉందన్న విషయం రూఢి ఐంది. విద్య కి అందంతో బాటు సునిశితమైన తెలివితేటలు, కరుణ నిండిన హృదయం, ఎదుటివారిని అర్థం చేసుకుని ప్రవర్తించే మంచి తనం..కూడా ఉన్నాయి...అప్పుడప్పుడే అర్థమైంది..నేను విద్యని ప్రేమిస్తున్నానని.నాతో జీవితాంతం కలిసి నడవాల్సిన అమ్మాయి తనే ననీ..! కానీ నేనూ తనతో ఎప్పుడూ ఈ విషయం చెప్పలేదు..తనూ అంతే..కాకుంటే..కొంచెం సూచనప్రాయంగా చెప్తుండేది విద్య..'మా వాళ్ళు నాకు సంబంధాలు చూస్తున్నారు..మీ అమ్మగారు..నన్ను చూసినప్పుడల్లా నేను మీ ఇంటి కోడలనైతే బావుంటుందని అంటున్నారు.." అని.

చివరికెలాగైతేనేం..ఇంక నా కనులముందు కనిపించే నా 'కలలరాణి' కి మనసులో మాట చెప్పేద్దామనుకున్నాను.. ఎలా చెప్పి వుంటారో మీరీపాటికి ఊహించే వుంటారు..నిజంగానే..అచ్చమైన తెలుగులో 'నేను నిన్ను ప్రేమిస్తున్నాను..' అని చెప్పాను (సిలికానాంధ్ర మిత్రులు భవిష్యత్తులో నామీద తెలుగుభాషా ప్రభావం చూపించబోతున్నారని అప్పటికే నా అంతరాత్మకి తెలిసిందేమో..!)



నే కోరుకున్న విద్య

ఐతే ఈ విషయం తనకి చెప్పడమనేది..సాదా సీదాగ జరగలేదు..అదంతా..ఒక అందమైన అనుభవం..! చాల సార్లు రిహార్సల్స్ వేసుకున్నాను..ఎప్పుడు, ఎక్కడ ఎలా తనతో ఈ విషయం చెప్పాలా అని.. ఆరోజు రానే వచ్చింది..ఒక శుక్రవారం రాత్రి...ఇద్దరం కల్సి ఒక జపనీస్ రెస్టారెంట్ లో భోజనం చేశాం..విద్యకి అంతకు ముందే చెప్పాను ..' మా ఆఫీసు కొలీగ్స్ కొంతమంది బాల్‌బోవా దీవుల్లో బోట్ రైడ్ కి వెళ్తున్నారంట..మనల్ని కూడా తమతో రమ్మంటున్నారు..వెళ్దామా?" అని అడిగాను..తను సరే నంది. ఇద్దరం కలిసి బాల్‌బోవా దీవులవైపు కారులో బయలుదేరాం.. మా కారు బాల్‌బోవా కి దగ్గరవుతుండగా మా ఫ్రెండ్స్ వద్దనుంచీ ఫోన్ వచ్చింది, ఏవో ఇబ్బందులవల్ల వాళ్ళెవరం రావడం లేదని.. 'ఎలానూ దగ్గరికి వచ్చేశాం కదా..మనిద్దరం ఏదైనా ఫెర్రీలో వెళ్దామా?' అని విద్యని అడిగాను. తను సరేనంది. తనని కారులో నే ఉండమని చెప్పి, నేను వెళ్ళి మాట్లాడి వచ్చాను. ఇద్దరం కల్సి డాక్ వద్దకి వెళ్ళే సరికి అద్భుతంగా అలంకరించబడిన బోటు సిద్ధంగా వుంది మాకోసం. ..రాత్రి అందంగా అలకరించుకుంది..చంద్రుడు వెన్నెల కురిపిస్తున్నాడు..పాల సముద్రంలాంటి ఆకాశంలో అక్కడక్కడా తారకలు మెరుస్తున్నాయి... మా బోటు నడిపే అతనుకూడా మంచి గాయకుడు..శ్రావ్యమైన ప్రేమగీతాలు ఆలపించడం మొదలుపెట్టాడు..బోటు ముందుకెళ్తోంది..వెన్నెల సముద్రకెరటాల మీదపడి ప్రతిఫలిస్తోంది..విద్యకి ఇదంతా కలా నిజమా అనిపిస్తున్నట్టుంది.. నేను ముందే తీసుకొచ్చిన కార్డు తన చేతిలో ఉంచాను..విద్యకి గ్రీటింగ్ కార్డులంటే చాలా ఇష్టం..కార్డు తెరిచి చూసింది..నా మనసులోని మాటలు అక్కడ అక్షర రూపంలో..లోపల మరోకార్డు..మరికొన్ని స్పందనలు..మరో కార్డు..మరికొన్ని ప్రేమ సందేశాలు..అన్నింటికంటే లోపల..చిన్న డైమండ్ ఉంగరం (కొన్ని

రోజుల క్రిందట తనని తీసుకెళ్ళి నా ఫ్రెండ్ కి కావాలని చెప్పి తనతోనే సెలెక్ట్ చేయించానది) ..విద్య కళ్ళనుంచీ..కన్నీళ్ళు..చెక్కిళ్ళు తడుస్తున్నాయి..తలెత్తి చూసింది..మోకాళ్ళ మీద గులాబీ పూల గుత్తితో నేను.. "విద్యా నిన్ను ప్రేమిస్తున్నాను..నన్ను పెళ్ళి చేసుకుంటావా..?" విద్య నాకౌగిట్లో ఒదిగి పోయింది మౌనంగా, ఆనందం నిండిన హృదయాలు..ఒక్కటైన క్షణం..ఇద్దరికీ ఇప్పటికీ ఒక మరపురాని మరువలేని మధుర క్షణం..!


మేమిద్దరం,మాకిద్దరు

ముందుగా అమ్మకి ఫోన్ చేసి చెప్పాము. చాలా ఆనందించింది.."మిమ్మల్ని ముందుగా పరిచయం చేసింది నేనే తెలుసా?" అంది ఆనందంతో..!

1997 డిసెంబర్ 14న తిరుపతిలో మాపెళ్ళి జరిగింది..తమ్ముడు ప్రసాద్, అక్క నిర్మల, బావ రామ్ కల్సి హైదరాబాదులో వైభవోపేతంగా రిసెప్షన్ ఏర్పాటు చేశారు.. విద్యా, నేనూ..మాదైన వైవాహిక జీవితంలోకి ప్రవేశించాం..ఇప్పుడు మా ఐదేళ్ళ అనూష, పధ్నాలుగునెలల కృష్ణమూర్తి(మా నాన్న గారి పేరు)..ఇద్దరు పిల్లలు..

మా పరిచయాల్లో కి తొంగి చూసిన మీ అందరికీ కృతజ్ఞతలు తెలియచేస్తూ..మీరు కోరుకున్న నేస్తంతో మీ జీవితాలు సుఖమయం కావాలని మనసారా ఆశిస్తున్నాను..

## విద్య

డిసెంబర్ మొదటివారం..1994..అప్పుడే వర్జీనియా నుంచీ కాలిఫోర్నియా యు.సి.ఐ. మెడికల్ సెంటర్ లో రెసిడెన్సీ చేయడానికి వచ్చాను. అప్పుడే చికెన్‌పాక్స్ వచ్చి, తగ్గుతోంది. మా ఆంటీ ఒకావిడ వాళ్ళింటికి వొచ్చి నయమయ్యే వరకూ ఉండమని అడిగింది. కొత్త ప్రదేశం..ఎవరూ స్నేహితులూ బంధువులూ లేరు. ఎవరైనా తెలుగు వాళ్ళు కనిపిస్తే బావుండును అనుకుంటుండగా ఒక రోజు ఫోన్ మోగింది. ఎవరో పెద్ద ఆవిడ మా ఆంటీ వివరాలకోసమని అడిగారు..మాటల మధ్యలో తమకి అర్టీజియా లో బొటిక్ ఉందనీ, ఓ సారి రమ్మనీ ఆహ్వానించారు. తెలుగు వాళ్ళని ఎప్పుడెప్పుడు కలుద్దామా అని ఆతృతగా ఉండడం వల్ల, చికెన్‌పాక్స్ పూర్తిగా తగ్గిపోవడం వల్లా ఆంటీని కలుద్దామని ఆర్టీజియా వెళ్ళాను. ..ఇంకా మొహం మీద కొంచెం మచ్చలు మిగిలి ఉన్నాయి..



సాహిల్ బొటిక్ లో అడుగు పెట్టగానే ఆజానుబాహుడైన..ఓ యువకుడు నన్ను ఆహ్వానించాడు. ఆంటీ వద్దకి వెళ్ళే లోగానే ఇద్దరం మాట్లాడుకున్నాం..వివరాలు తెలుసుకున్నాం.. ఆంటీ రుక్మిణి గారు, మా అమ్మానాన్నల గురించీ, నాచదువుగురించీ..వివరాలు అడిగారు...అప్పుడు అనుకోలేదు..నన్ను రుక్మిణి ఆంటీకి పరిచయం చేసిన వ్యక్తే నాకు భవిష్యత్తులో భర్త అవుతారని..!

లక్ష్మణ్ ని చూడగానే చాలాకాలం నుంచీ పరిచయమున్నట్లు అనిపించింది. మరునాడు లక్ష్మణ్ గురించీ..వాళ్ళ అమ్మగారి గురించీ ఆలోచిస్తూ నిద్రలేచాను.. ఆ రోజు సాయంకాలమే తనకి ఫోన్ చేసి, మా కాలేజీలో జరిగే క్రిస్మస్ పార్టీకి రమ్మని ఆహ్వానించాను.. సరే నన్నారు ..ఈ డాక్టర్ల మధ్యన నేనేమిట్లే అనుకోకుండా పార్టీకి వచ్చారు..పార్టీ బాగా జరిగింది.. లక్ష్మణ్ లో ఎదుటివారిని అర్థం చేసుకుని మసలే మనస్తత్వం నాకు ముందునుంచే నచ్చింది. ..మా స్నేహం వేగంగా పెరిగింది.. ఎప్పుడు నన్ను చూడడానికి రావాలనుకున్నా ..ముందుగా ఫోన్ చేసి, నాకు డ్యూటీ ఐపోయిందనీ, కాస్త విశ్రాంతి తీసుకున్నాననీ తెలిశాకే నన్ను చూడడానికి వచ్చేవారు. ఈ 'కేరింగ్' మనస్తత్వమే ముందునుంచీ నను కట్టి పడేసింది. 1996 జనవరి మొదటి తేదీన ఇద్దరం కలిసి మాలెబు దేవాలయానికి వెళ్ళాం.. కొత్త సంవత్సరం మొదటిరోజున, వెంకటేశ్వర స్వామిసన్నిధిలో మనసులో అనుకున్నాను..ఈయనతో ప్రేమలో పడ్డాను..జీవితాంతం కలిసి బ్రతకాల్సిన వ్యక్తి ఈయనే అని..!

తానా సభల్లో తనతో కలిసి పనిచేయడం మా సాన్నిహిత్యాన్ని మరింతపెంచింది..ఎప్పుడూ ఒకరికొకరం నోరువిప్పి చెప్పుకోకపోయినా ఇద్దరికీ మనసులో ఒకే భావం ఉండేది..

1997 అగస్ట్‌లో..ఒక వీకెండ్..శుక్రవారం ఇద్దరం కలిసి బయట భోజనం చేసి, బయటికి రాగానే, తమ స్నేహితులతో కలిసి బాల్‌బోవా ద్వీపానికి వెళ్దామని అన్నారు లక్ష్మణ్..తనతో మరొకొంచెం సేపు గడపాలని మనసు తొందర చేస్తుండడం వల్ల కాదనలేక పోయాను..పండు వెన్నెల్లో, లక్ష్మణ్ తో కలిసి సముద్రంలో బోటు విహారం..ఊహే ఎంతో త్రిల్లింగ్ గా అనిపించింది..మధ్యలో వాళ్ళ ఫ్రెండ్స్ రాలేక పోవడం..ఇద్దరమే కలిసి అత్యద్భుతంగా అలంకరించబడిన బోటులో..బోటు నడిపే అతను మధురమైన ప్రేమగీతాలు పాడుతుండగా..లక్ష్మణ్..చాలా డ్రమెటిక్ గా నన్ను ప్రేమిస్తున్నానని చెప్పారు. .ఆయన ఇచ్చిన కార్డుల్లో మా పరిచయం తనని ఎంత మార్చేసిందో ననీ, మరో కార్డులో జీవిత భాగస్వామికోసం తన అన్వేషణ ఈ రోజుతో ముగియనున్నదనీ..ఇలా తన మనోభావాలని అందంగా తెలియచేశారు.. చివరలో నాకోసం డైమండ్ రింగ్..!

కళ్ళు ఆనందం నిండిన కన్నీళ్ళతో నిండిపోయాయి..చెక్కిళ్ళు తడిసి పోతున్నాయి..కళ్ళు తెరిచేసరికి దోసిలినిండా గులాబీపూలతో లక్ష్మణ్..! తను చెప్పిన మాటలు..నన్ను ప్రేమిస్తున్నాననీ అన్న పలుకులు..ఇంకా నా చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి..!

డిసెంబర్ 14 న దైవ సన్నిధిలో తిరుపతిలో వివాహ బంధంతో ఒక్కటయ్యాం..!

ఇంతటి ప్రేమ మూర్తిని నాకు భర్తగా ప్రసాదించిన భగవంతుడికి ఎప్పుడూ కృతజ్ఞు రాలినే...!


ఇద్దరం ఒక్కటైన వేళ

లాస్ యేంజల్స్ లో నివసించే లక్ష్మణ్ కోకా ఒక ప్రముఖ కంపెనీకి western Regional Manager గా పనిచేస్తున్నారు. Transcript USA అనే మెడికల్ ట్రాన్స్క్రిప్ట్ కంపెనీని ౧౯౯౮లో స్థాపించి విజయవంతంగా నడిపిస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి, ఆర్జీజియా లోని లిటిల్ ఇండియా లో వ్యాపారాలు కూడా నిర్వహిస్తున్నారు. ౨౦౦౬ లో లాస్ యేంజల్స్ లో జరగబోయే ఆటా నవమ సమావేశాలకు కో-ర్డినేటర్ గా ఎంపిక చేయబడ్డారు. ౧౯౯౭ తానా సమావేశాల్లో యూత్‌కమిటీ అధ్యక్షులుగా ఉన్నారు..ఇంకా అనేక సమాజసేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉంటారు..

శ్రీమతి విద్యగారు కాలిఫోర్నియా Hernet లో Practicing Prhysician గా పనిచేస్తున్నారు. WOMAN'S HEALTH CARE & PEDIATRICS లో ప్రత్యేక సేవలు చేస్తున్నారు. లక్ష్మణ్ గారు నిర్వహించే కార్యక్రమాలన్నింటిలోనూ చురుగ్గా పాల్గొంటూ ఉంటారు..

జీవితం అనుభవాల సంపుటి! కొన్ని అనుభవాలు అనుభూతులుగా మారి మనసు పొరల్లో కలకాలం కొలువుంటాయి. వర్తమానం గందరగోళంగా అనిపించినప్పుడు అనుభూతులు నిద్రలేచి మనల్ని ఊరడిస్తాయి. అందరి అనుభవాలూ ఒక్కటిగా ఉండాల్సిన అవసరం అస్సలు లేదు కానీ..ప్రతి వారి జీవితంలోనూ తమ జీవిత భాగస్వామిని కలుసుకోవడం అనేది ఒక మరపురాని అనుభవం అనేది అందరూ అంగీకరించే వాస్తవం. అది .. పెద్దలు ఏర్పాటు చేసిన పెళ్ళిచూపులు కావొచ్చు, రైలు ప్రయాణం కావొచ్చు, కాలేజీ లో యూత్ ఫెస్టివల్ కావొచ్చు,ఇంకోటి..మరోటి.. మీరు మీ శ్రీమతిని / శ్రీ వారిని మొదటిసారిగా ఎక్కడ చూశారు, ఏం మాట్లాడుకున్నారు..ఒక సారి మన 'సుజనరంజని' పాఠకులతో పంచుకోండి. ..మరోసారి మీ అనుభూతుల సుమ పరిమళాల్ని ఆస్వాదించండి. మీకోసం, మీరే నిర్వహిస్తున్న ఈశీర్షిక కు ఫోటోలతో సహా పంపించండి.. ! మీ ఆర్టికల్ తో బాటు హామీపత్రం, మీ పూర్తి వివరాలు జతజేయడం మరచిపోకండి. అనుభవాలు మీవి..వేదిక మాది..అనుభూతులు మనందరివీ!